బీఆర్ఎస్ ఆదరణ చూసి..ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్



కార్పొరేటర్ శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

జవహర్‌నగర్, నవంబర్ 9: బీఆర్ఎస్ పార్టీకి ప్రజలనుంచి వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్ అవుతుందని కార్పొరేటర్ జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కార్పొరేషన్‌లోని 27వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు 200మంది కార్పొరేటర్ జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

కోడింగ్ సిస్టంపై విద్యార్థులు పట్టు సాధించాలి



సదస్సులో పాల్గొన్న గూగుల్ ప్రొడక్ట్ మేనేజర్ మానస ఇనంపూడి

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 9: ప్రతి విద్యార్థి సాఫ్ట్‌వేర్ రంగంలో విజయం సాధించాలంటే కోడింగ్ సిస్టంపై పట్టు సాధించాలని రిసోర్స్ పర్సన్ మానస ఇనంపూడి సూచించారు. మండల పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్శిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం, ఐఈఈఈ సీఐఎస్ స్టూడెంట్ చాప్టర్ సహకారంతో రోడ్ మ్యాప్ టు సక్సెస్ కోడింగ్ అనే అంశంపై గురువారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా స్టూడెంట్ చాప్టర్ వెబ్‌సైట్, లింక్‌డ్ ఇన్ హ్యాండిల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రిసోర్స్ పర్సన్ మానస ఇనంపూడి (గూగుల్ ప్రొడక్ట్ మేనేజర్)కోడింగ్ విజయపథంలోకి ఎలాదారి తీస్తుందనే అంశంపై విద్యార్థులకు వివరించారు. ఆన్‌లైన్ కోర్సులు, సెల్ఫ్ ప్రాక్టీస్ ద్వారా కోడింగ్ నైపుణ్యాలను మెరుగుపరిచే పద్ధతులను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఈఈఈ సీఐఎస్ వైస్ చైర్మన్ విజయేందర్ రెడ్డి, డీన్ విజయకుమార్, హెచ్ వోడీ మల్లికార్జున్ రెడ్డి, సంతోష్, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

సొంతగూటికి పీఏసీఎస్ డైరెక్టర్లు

బీఆర్ఎస్‌లో చేరుతున్న పీఏసీఎస్ డైరెక్టర్ విష్ణు

శామీర్‌పేట, నవంబరు 9: శామీర్‌పేట పీఏసీఎస్ డైరెక్టర్లు జీలకరి విష్ణు, ప్రతాప్ రెడ్డి సొంత గూటికి చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తిరిగి గురువారం బీఆర్ఎస్‌లో చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు అనితాలాలయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, డైరెక్టర్‌లు భూమిరెడ్డి, బాపుసింగ్, నర్సింలు గౌడ్, బీఆర్ఎస్ మండల కార్యదర్శి అనిల్ రెడ్డి, అఫ్జల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

సంజయ్ (ఫైల్)

మేడ్చల్, నవంబరు 9: ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన సంజయ్ (21) గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలకు వచ్చిన సంజయ్ కళాశాల టెర్రస్ పైకి వెళ్లాడు. అనంతరం నాలుగో అంతస్తు నుంచి దూకాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని సీఎంఆర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి సూరారం నారాయణ హాస్పటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మెరిట్ విద్యార్థి అయిన సంజయ్ ప్రేమ వ్యవహారం కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. విద్యార్థి మృతితో కళాశాలకు సెలవు ప్రకటించారు.

రేపు గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం

బోడుప్పల్,నవంబర్9: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గిరిజనులకు అందుతున్న పథకాలకు కృతజ్ఞతగా ఈనెల 11న నిర్వహించే గిరిజన ప్రజాప్రతినిధుల రాష్ట్రస్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బోడుప్పల్ 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యసుమన్ నాయక్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ హాల్ శామీర్‌పేట్ జరిగే మా తండాలో మారాజ్యం, గిరిజనుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, రాష్ట్ర మంత్రులు, చైర్మన్లు, రాష్ట్ర గిరిజన ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

100 శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు చేపట్టాలి

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 9: ఎన్నికల సందర్భంగా ఈనెల 30న జరిగే పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవును ప్రకటించినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థలకు వేతనంతో కూడిన సెలవును ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.100శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. జిల్లాలోని ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు స్లిప్పులను త్వరలో పంపిణీ చేస్తామని, ఫొటోతో ఉన్న ఓటరు కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డులో ఏదైనా ఒకదాన్ని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు.

27 నామినేషన్లు దాఖలు

కీసర,నవంబర్ 9:మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 27 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఆర్డీవో రాజేశ్‌కుమార్ తెలిపారు. గురువారం కీసర ఆర్డీవో కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థులతో పాటు కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్ నామినేషన్‌ను ఆర్డీవోకు అందజేశారు.

కీసరలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న జవహర్‌నగర్ తెలంగాణ ఉద్యమకారులు

భద్రతకు పెద్దపీట

- బాధితులకు బాసట
- పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం
- తగ్గిన నేరాలు..స్వల్ప వ్యవధిలో నేరస్తుల పట్టివేత

ఘట్‌కేసర్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన పోచారం ఐటీకారిడార్ పోలీస్‌స్టేషన్

కీసర పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ

మేడ్చల్, నవంబరు 9: ఒక ప్రాంతంలో నివసించాలంటే ప్రజలు మొదట కోరుకునేది మెరుగైన భద్రత. ఎవరి నుంచి బాధలు లేకుండా స్వేచ్ఛగా జీవించగలిగే పరిస్థితులు ఉంటే నివసించే వారికి సంఖ్య పెరుగుతుంది. సీఎం కేసీఆర్ భద్రతకు పీటవేస్తూ పోలీస్‌స్టేషన్‌లను బలోపేతం చేశారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ, సదుపాయాలు కల్పించి రాష్ట్రంలో భద్రతను పెంచారు. అందులో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలో భద్రతా సౌకర్యాలు మెరుగుపడ్డాయి.

నూతన జోన్లు ఏర్పాటు

మేడ్చల్ నియోజకవర్గంలో 61 పంచాయతీలు, 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఉన్నాయి. నగర శివారులో ఉండి, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన మేడ్చల్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం తరలివస్తున్నారు. వారిలో నేర చరిత్ర ఉన్న వారు కూడా ఉంటున్నారు. అందు కోసం బాలానగర్ డీసీపీ జోన్‌ను విడదీసి మేడ్చల్ డీసీపీ జోన్ ఏర్పాటు చేశారు. జోన్ పరిధిలో ఇద్దరు ఏసీపీలను నియమించారు. మేడ్చల్ ఏసీపీ పరిధిలో మేడ్చల్, దుందిగల్, సూరారం పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. పేట్ బషీరాబాద్ ఏసీపీ పరిధిలో పేట్‌బషీరాబాద్, శామీర్‌పేట, జీనోమ్ వ్యాలీ, అల్వాల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. దీంతో అధికారుల పర్యవేక్షణ పెరిగి, నేరాల సంఖ్య తగ్గించే అవకాశం ఏర్పడింది.

కొత్త పోలీస్‌స్టేషన్‌ల ఏర్పాటు

శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జీనోమ్ వ్యాలీలో కొత్త పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే ఘట్‌కేసర్ పరిధిలో పోచారం ఐటీకారిడార్ పోలీస్‌స్టేషన్, మేడ్చల్ ఏసీపీ పరిధిలో సురారం పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే ప్రమాదాల నివారణకు అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి మేడ్చల్, శామీర్‌పేటను విడదీసి, మేడ్చల్ కొత్తగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే చిన్నారులు, మహిళలకు అండగా నిలుస్తున్న షీ టీమ్స్ నిర్వహిస్తున్న భరోసా కేంద్రం గతేడాది జూలైలో మేడ్చల్‌లో ప్రారంభించారు.

భారీగా సీసీ కెమెరాల ఏర్పాటు

నియోజకవర్గ పరిధిలోని మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 538 కమ్యూనిటీ సీసీ కెమెరాలతో పాటు 6368 కెమెరాలను ఏర్పాటు చేశారు. మేడిపల్లిలో 876 కమ్యూనిటీ సీసీ కెమెరాలతో పాటు 8912 కెమెరాలను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై మరో 42 కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే శామీర్‌పేటలో 879, జవహర్‌నగర్ 1200, పోచారం 500 కమ్యూనిటీ, 3500, ఘట్‌కేసర్‌లో 250 కమ్యూనిటీ, 800 కెమెరాలను ఏర్పాటు ఏర్పాటు చేశారు. వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రధాన కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేసి, పర్యవేక్షిస్తున్నారు. నేరాల పరిష్కారం రేటు గతంలో 18నుంచి 25 ఉండగా ప్రస్తుతం 50 నుంచి 60 ఉంది.